క్లుప్తంగా

ఘనంగా బోనాల పండుగ



దుర్గమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మునిపల్లి(అందోల్): శివరాత్రిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మండలంలోని మేళ సంగ్యం గ్రామ శివారులో చిన్న ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారికి భక్తులు బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. గురువారం దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను భక్తులు డప్పు చప్పుళ్లతో బోనాల ఊరేగింపు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం దేవాలయం చుట్టూ బండ్ల ఊరేగింపు నిర్వహించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల సందర్శన

కాంగ్రెస్ నేత నీలం మధు



కాంగ్రెస్ శ్రేణులతో నీలం మధు

పటాన్‌చెరు: ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని గురువారం నీలం మధు పరిశీలించారు. పట్టభద్రులు తమ ఓటు వినియోగించుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బొల్లారం మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం చీమల్‌పాడ్‌కు చెందిన నీలమ్మకు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.14,500 మంజూరయింది. సంబంధించిన చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బాధితురాలు నీలమ్మ కుటుంబీకులకు అందజేశారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, మల్గొండ, మశ్చందర్, బస్వరాజ్, చింటూ, నరేష్ పాల్గొన్నారు.

నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు

ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్



పెన్షన్ పత్రాలను ఇస్తున్న విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. గురువారం పదవి విరమణ పొందిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్ కాపీలను నిధి ఆప్కే నికత్ కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పీపీఓలను జారీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్–2 శ్రీమతి శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్, అరబిందో ఫార్మా హెచ్‌ఆర్ రాజు పాల్గొన్నారు.

ఖానాపూర్(కె)లో భజనలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో గురువారం అఖండ హరినామ సప్తహ నిర్వహించారు. హనుమాన్ మందిరం వద్ద భజనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉప్పరి అంజయ్య, ఎస్‌ఆర్‌పి మశ్చందర్, జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచకురాలిని ఢీకొన్న వాహనం

గజ్వేల్‌రూరల్: పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన ఓ యాచకురాలిని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అరవింద్ ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు.

పర్యావరణానికి నిప్పు పెట్టి..

తారా డిగ్రీ కళాశాల ఎంట్రన్స్‌లో పచ్చని చెట్లు స్వాగతం పలుకుతాయి. ఎండాకాలం కావడంతో చెట్ల ఆకులు, చిన్నచిన్న కొమ్మలు ఎండిపోయి రాలిపోయాయి. గడ్డికూడా పూర్తిగా ఎండిపోయింది. దీనితో ఆ ప్రాంతమంతా చెత్తతో పేరుకుపోయింది. కళాశాల సిబ్బంది ఆ చెత్తను తొలగించి శుభ్రం చేయించాలి. కానీ, చెట్ల మధ్యలో ఉన్న చెత్తకు నిప్పు పెట్టారు. చెత్తతో పాటు చెట్లకు కూడా మంటలు అంటుకున్నాయి. దీంతో కొన్ని చెట్లు పూర్తిగా కాలిపోయాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



తారా కళాశాల ఎంట్రన్స్‌లో తగలబెట్టిన చెట్ల ప్రాంగణం





మంటకు కాలిపోయిన చెట్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

బారులు తీరిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు • కలెక్టర్, ఆర్డీఓ, అధికారులు పరిశీలన • పోలీసులు పటిష్ట బందోబస్తు

జోగిపేట(అందోల్): జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఈ పోలింగ్‌లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటును వినియోగించుకున్నారు. జోగిపేట .. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 76.08 శాతం, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 91.89 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. చౌటకూరు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, మిగతా కేంద్రాలను ఆర్డీఓ పాండు సందర్శించారు.

సదాశివపేట పట్టణంలో..

సదాశివపేట పట్టణంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం 415లో 740 పట్టభద్రుల ఓట్లు ఉండగా 568ఓట్లు పోలయ్యాయి. 416లో 748 ఓట్లకు గాను 575ఓట్లు పోలయ్యాయి. అలాగే, 214 పోలింగ్ కేంద్రంలో 106 ఉపాధ్యాయ ఓట్లకు, 98ఓట్లు పోలయ్యాయి.

వట్‌పల్లిలో..

వట్‌పల్లిలో 23 మంది టీచర్ ఓటర్లకు గాను 21 మంది ఉపాధ్యాయులు, 706 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 522 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శంభీరెడ్డి తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 91.3శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 93.4 శాతం పోలింగ్ నమోదైంది.

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో..

పటాన్‌చెరు మండల పరిధిలో మొత్తం గ్రాడ్యుయేట్స్ ఓటర్లు 1938 ఉండగా, 1452 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 107 మంది ఉండగా.. 103 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో..



అమీన్‌పూర్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో..

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రాడ్యుయేట్స్ పోలింగ్ స్టేషన్ 420లో 1245 ఓట్లు ఉండగా అందులో 787 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, 421లో 1214 ఓట్లు ఉండగా అందులో 783 ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 175 ఉండగా, 160 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కందిలో...

కంది(సంగారెడ్డి): కందిలో టీచర్స్ ఎమ్మెల్సీకి 48ఓట్లు ఉండగా 44మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీకి 687 ఓట్లు ఉండగా 575మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఝరాసంగంలో..

ఝరాసంగంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 26 మంది ఓటు వేయాల్సి ఉండగా 25 మంది ఓటు వేశారు. పట్టభద్రుల ఎన్నికకు 628 మంది పట్టభద్రులు ఓటు వేయాల్సి ఉండగా కేవలం 469 మాత్రమే ఓటు వేశారు.

న్యాల్‌కల్‌లో..

పట్టభద్రుల ఎన్నికలకు 398 మందికి గాను 276 మంది ఓటు హక్కును వినియోగించుకోగా (69 శాతం), ఉపాధ్యాయుల ఎన్నికలకు సంబంధించి 25 మందికిగాను 23 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జిన్నారం మండలంలో..

మండలంలో 460 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 13 మంది టీచర్లు ఓటు వేశారు. పట్టభద్రుల 100శాతం పోలింగ్ జరిగిందని అధికారులు వెల్లడించారు.

జహీరాబాద్ డివిజన్‌లో ..

జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 73.26 శాతం పోలింగ్ నమోదు కాగా, టీచర్స్ ఎమ్మెల్సీ పదవికి 94.70 శాతం పోలింగ్ నమోదయింది. డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓట్లు 4,544 ఉండగా, 3,329 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. టీచర్లకు సంబంధించి 509 ఓట్లు ఉండగా 482 ఓట్లు పోలయ్యాయి.



కల్హేర్: పోలీసులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సంజీవరావు



జహీరాబాద్: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



రామచంద్రపురం: ఓటు హక్కును వినియోగించుకున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

ఘనంగా వెంకట ఖ్వాజా దర్గా ఉత్సవాలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు డప్పు చప్పుళ్ల మధ్య గంధం సమర్పించి ప్రార్థనలు చేశారు. డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రజినీకాంత్, మాజీ ఎంపీటీసీ శివాజీరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జైలు శిక్ష విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీ లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి ఒకరోజు జైలుశిక్ష, ఒకరికి రూ.1500, మరొకరికి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

16 మందికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పా రు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 14 మందికి రూ.వెయ్యి, ఇద్దరికి రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్లు ఇరుకు.. ప్రయాణం బెరుకు



జహీరాబాద్ పట్టణంలో ఇరుకుగా ఉండి దెబ్బతిన్న బ్లాక్ రోడ్డు

విస్తరణకు నోచుకోని దారులు

- మంజూరైన నిధులూ రద్దయిన వైనం
- కౌన్సిల్ లేకపోవడంతో సమస్యల సుడిగుండంలో విలీన గ్రామాలు
- పట్టించుకునే నాథుడేలేడని స్థానికుల ఆవేదన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రోజురోజుకూ విస్తరిస్తోన్నా పట్టణంలో అధ్వాన స్థితిలో ఉన్న రోడ్లు మాత్రం విస్తరణకు నోచుకోవడం లేదు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా రోడ్లను ఆక్రమించుకోవడంతోపాటు రద్దీ పెరిగి రోడ్లు ఇరుకుగా మారిపోయాయి. ఫలితంగా అటువైపు ప్రయాణమంటేనే వాహనదారులు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బెరుకు బెరుగ్గా ప్రయాణించాల్సి వస్తోంది.

లక్షా పాతిక వేల జనాభా...

జహీరాబాద్ పట్టణం 65వ జాతీయ రహదారిపై ఉంది. సుమారు 1.25 లక్షల జనాభా ఉన్న జహీరాబాద్‌లో 37 వార్డులు ఉన్నాయి. ఇందులో ఎక్కువ వార్డులు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దారులన్నీ ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. పాతపట్టణ ప్రాంతమైన మానిక్‌ప్రభు, నాగులకట్ట, గడి, ఆర్య నగర్, పాండురంగవీధి, శ్రీరాం మోహల్లా, కసాబ్ గల్లీ, శాంతినగర్‌తోపాటు బ్లాక్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర అంతర్గత రోడ్లు విస్తరణకు నోచుకోవడంలేదు.

అక్రమ నిర్మాణాలు తొలగిస్తేనే...

పట్టణంలోని అధికశాతం రోడ్లు ఇరుకుగా ఉండటంతోపాటు ధ్వంసమయ్యాయి. పెద్ద పెద్ద వాహనాలు ఈ దారుల గుండా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు చిన్న వాహనాలు ఎదురుగా వచ్చినా రోడ్డు దాటడం కష్టంగా ఉంటోంది. రోడ్డుకిరువైపులా ద్విచక్రవాహనదారులు అక్రమ పార్కింగ్ చేయడం, మరికొంతమంది వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో అటు వాహనదారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరైనా...

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జహీరాబాద్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినా చాలా వరకు పనులు చేపట్టలేదు. ఈ నిధుల్లో రూ.9 కోట్లతో రోడ్లు, రూ.21 కోట్లతో మురికి కాల్వలు ఇలా 88 రకాల అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. అయితే వాటిని చేపట్టక నిధుల్ని ఖర్చు చేయలేదు. ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఈ నిధులను రద్దు చేసింది.

విలీన గ్రామాల్లో అదే పరిస్థితి

జహీరాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు రంజోల్, పస్తాపూర్, అల్లీపూర్, చిన్న హైదరాబాద్‌తో పాటు హోతి(కె)లను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో కూడా అంతర్గత రోడ్లు కూడా గుంతలమయంగా ఉన్నాయి. మురికి కాల్వలు, కల్వర్టు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

కౌన్సిల్ లేక..

జహీరాబాద్ మున్సిపల్‌కు కౌన్సిల్ లేక విలీన పంచాయతీల గురించి పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగిసి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఎన్నికలు కూడా నిర్వహించలేదు. మున్సిపల్‌లో విలీనమైందున సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించలేదు. దీంతో గ్రామ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం

శివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో గురువారం మంత్రోచ్చరణలు, బాజాభజంత్రీల మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంచామృత అభిషేకం, పల్లకీ సేవ ఊరేగించారు. భజనలు, భక్తిపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.



నారాయణఖేడ్: పంచగామ నాగేశ్వరాలయంలో..



మునిపల్లి: మాంగళ్యధారణ క్రతువు



పటాన్‌చెరు టౌన్: బీరంగూడ గుట్టపై..



సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని శివాలయంలో ..



జోగిపేట(అందోల్): జోగినాథ ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



జహీరాబాద్ టౌన్: సిద్ధేశ్వర స్వామి ఆలయంలో..



జహీరాబాద్ టౌన్: సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు



జిన్నారం: సంప్రదాయ దుస్తులలో చిన్నారుల నృత్య ప్రదర్శన

ఘనంగా భద్రప్పస్వామి జాతర



దుర్గమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల కేంద్రంలో భద్రప్పస్వామి జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మందిరం చుట్టూ బండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌శెట్టి, నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ జాతర..

మండలం పరిధిలోని ఇందిరానగర్‌లో దుర్గమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బోనాలు ఊరేగింపు, బండ్ల ప్రదర్శన చేపట్టారు. ఎస్‌ఆర్‌పి గుర్రపు మశ్చేందర్ దుర్గమ్మతల్లికి ప్రత్యేకంగా పూజలు చేశారు.

గోసాయిపల్లిలో మహాదేవుని జాతర..

సిర్గాపూర్ మండలం గోసాయిపల్లిలో మహాదేవుని ఉత్సవాలు నిర్వహించారు. రథం ఊరేగింపు, అగ్నిగుండం, తదితర కార్యక్రమాలు చేపట్టారు.